# వేరు ముక్క

-ఆర్.శ్యామల

ఉదయం పదకొండు అయింది. పనయ్యాక రిలాక్స్‌గా కూర్చుని ఆ రోజు పేపరు చదువుకుంటున్నాను. ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. పక్కింటి లలిత.

"వదినా! కొయ్యబొమ్మలు వచ్చాయి. చాలా బాగున్నాయి. కొంటావా?" అంది ఉత్సాహంగా. చూద్దాంలెమ్మని నేను బయటకు వచ్చాను. బుట్టలో రకరకాల బొమ్మలు తెచ్చి అమ్ముతున్నాడు ఓ యాభై ఏళ్ల ముసలాడు. అప్పటికే నలుగురైదుగురు ఆడవాళ్లు చుట్టూ చేరి ఉన్నారు. జంతువుల బొమ్మలు, మనుష్యుల బొమ్మలు, పక్షుల బొమ్మలు చాలా బాగున్నాయి. అలాంటివి అప్పటికే మా ఇంట్లో ఉన్నాయి. నా దృష్టి బుట్టలో అడుగున చెక్కతో చేసిన కుంకుమ భరిణమీద పడింది. వెంటనే అది తీయమని చెప్పి ఒక భరిణ తీసుకున్నాను.

"నీ దగ్గర వెండి భరిణ ఉంది కదా. ఇదెందుకు వదినా?" అంది లలిత.

నవ్వేసాను. మిగిలినవాళ్లు అందరూ బొమ్మలు బేరమాడి తీసుకున్నారు. నేను భరిణకి డబ్బులిచ్చి ఇంట్లోకి వచ్చేసాను. భరిణని చూస్తుంటే ఏవో పాత జ్ఞాపకాలు...బాల్యంలోకి వెళ్లిపోయాయి.

***

అప్పుడు నేను నాలుగో తరగతి చదువుతున్నాను. చెల్లి మూడు. నాన్న ఆర్మీలో క్లర్క్ ఉద్యోగం. అందరం ఢిల్లీలో ఉండేవాళ్లం. కానీ నాన్నకి అస్సాం ట్రాన్స్‌ఫర్ అవడంతో అమ్మని, మమ్మల్ని వూర్లో నానమ్మ దగ్గర విడిచిపెట్టి అస్సాం వెళ్లిపోయారు.

వూర్లో ఇల్లు పూరిల్లు పెద్దదే. కరెంటు ఉండేదికాదు. వంటగది ఇంటికి ఎదురుగా వేరుగా ఉండేది. ఇంటికి వంట గదికి మధ్యలో పది అడుగుల ఖాళీ స్థలం. అక్కడే రాత్రిళ్లు మంచాలు వేసుకుని ఆకాశంలో చుక్కలు లెక్కపెట్టుకుంటూ పడుకునేవాళ్లం. ఇంట్లో నాన్నమ్మ, అమ్మ, నేను, చెల్లి నలుగురుమే.

నాన్నమ్మదో వింత మనస్తత్వం. కొంతసేపు బాగుంటే కొంతసేపుముఖం మాడ్చుకుని ఉండేది. నాన్నమ్మ తెల్లగా, ఎత్తుగా ఉండేది. చెవులకి కొనకమ్మలు, దిద్దులు, ముక్కుకి కమ్మలు, అడ్డకమ్మి, నుదుటన పచ్చబొట్టు ఉండేది. తాతయ్య చనిపోయాక ఆమెకి రైల్వే పెన్షన్ అందేది. అప్పట్లో మూడొందలు. డబ్బుల్ని జాగ్రత్తగా ఖర్చు చేసేది.

ఒకరోజు సాయంత్రం స్కూలు నుండి నేను, చెల్లి వస్తున్నాం. ఇంటికి వెళ్లే సందులో నాన్నమ్మ ఓ కోయవాడితో మాట్లాడుతోంది. ఏమిటో చూద్దామని ఆసక్తిగా నిలబడి కోయవాడి వేషభాషలను చూస్తున్నాము. వాడు అప్పుడప్పుడు వస్తుంటాడు. జాతకాలు చెప్పడం, బెణుకులు, వాపులకి పసర్లు, మందులు ఇస్తుండేవాడు.

"నాయనా! నాకు బతకాలనిలేదు. చచ్చిపోవడానికి ఏదైనా మందివ్వు బాబూ... నీకు పుణ్యముంటుంది" నాన్నమ్మ కోయవాడితో అంది.

"ఏవమ్మా అలా అంటుండావు. నీకేం తల్లీ మారాణివి. దర్జాగా బతుకుతున్నావు. నీకేం కష్టం తల్లీ" అన్నాడు సానుభూతితో.

"ఏం సెప్పను నాయనా... నా మాట చెల్లదు. అంతా కోడలు పెద్దరికమే" అంది ముక్కు చీదుతూ.

'అమ్మమీద కోపం వచ్చిందన్నమాట' మనసులో అనుకున్నాను.

"సర్లే తల్లీ నీ ఇష్టం" అని వాడు సంచిలో చేయి పెట్టి మూడు అంగుళాల పొడవున్న వేరు ముక్క ఇచ్చాడు.

"ఇది నూరి నీళ్లలో కలిపి తాగేయమ్మా. సక్కగా నిద్దర్లోనే సచ్చిపోతావు. మూడు రూపాయలు ఇయ్యి తల్లీ"

"ఆ...ఇంతోటి దీనికి మూడు రూపాయలా? రూపాయి తీసుకో" అని వాడి చేతిలో రూపాయి పెట్టింది.

కోయవాడికి కోపమొచ్చింది.

"ఇంతోటి దానికి మందెందుకు? ఎల్లి గన్నేరు పిక్కలు నూరుకోమ్మా. పైసా కరుసుండదు" అని వేరు ముక్క లాక్కున్నాడు.

"ఏంటయ్యా అంత కోపం" అని గయ్‌మంది. "ఇంద ఇంకో రూపాయి తీసుకో" అని ఇంకో రూపాయి ఇచ్చి వేరుముక్క తీసుకుంది.

నాకు, చెల్లికి పెద్ద దేవరహస్యం తెలిసిపోయినంత సంబరపడిపోయాము.

"ఏం నానమ్మా చచ్చిపోతావా?" అన్నాము ఇద్దరం.

"అవునే. నాకు బతకాలని లేదు" అంది వేదాంతిలా విరక్తిగా.

ఇంటికి నాన్నమ్మ వెనకాలే వెళ్లాము. ఆ వేరు ముక్కని చెక్కతో చేసిన కుంకుమభరిణలో పెట్టింది. ఎరుపురంగుతో నారింజకాయంత ఉంటుందా భరిణ. ఇంటికి వచ్చిన దగ్గర్నుంచి ఆ వేరుని ఎప్పుడు నూరుకుని తాగుతుందా అ ఓ కంట చూస్తూనే ఉన్నాము. చీకటి పడిపోయింది. 'ఇంకా మందు తాగదేమి?' అని అనుమానం నాకు. రాత్రి అందరం పడుకున్నాక తాగుతుందేమో అని మళ్లీ నాకు నేనే జవాబిచ్చుకున్నాను.


నేనైతే హోంవర్క్ చేయలేదు. 'నాన్నమ్మ చచ్చిపోతే రేపు స్కూల్‌కి ఎలాగూ వెళ్లను.

ఇంకెందుకు హోంవర్క్ వేస్ట్' అని రాయలేదు.

నాన్నమ్మ అమ్మతో ముభావంగా మాట్లాడింది. మధ్యాహ్నం తనకి ఇష్టం లేని కూర బంగాళాదుంప వండినందుకు అలక. అది మాకిష్టం. అందుకే వారంకొకసారి అమ్మ మాకోసం వండేది. రాత్రి అమ్మ వేరే కూర చేస్తే మామూలుగానే తినేసి పడుకుంది. నా కళ్లు టేబుల్‌మీద భరిణమీద ఉన్నాయి.

తెల్లవారి లేచిన వెంటనే చూసాను.నాన్నమ్మ మంచంమీద లేదు. భరిణ తీసి చూసాను. అందులో వేరు ముక్క ఉంది. బోల్డు నిరాశ వేసింది. నాన్నమ్మ చచ్చిపోలేదు. అంటే ఈ రోజు స్కూల్‌కి వెళ్లవలసిందే అనుకుని ఉదయం గబగబా హోంవర్క్ చేసుకుని ఆదరాబాదరాగా స్కూల్‌కి వెళ్లాను. స్కూల్‌లో కూడా ఇవే ఆలోచనలు.

'ఉదయం చచ్చిపోతుందా? మధ్యాహ్నం మేము భోజనానికి వెళ్లేసరికి చచ్చిపోతుందా? లేకపోతే ఎవరైనా వచ్చి మీ నాన్నమ్మ చచ్చిపోయిందని కబురు చెబుతారా. అప్పుడు స్కూల్‌లో అందరూ జాలిగా చూస్తారు.



అదేదో చాలా గొప్పగా ఉంటుంది. చాలామంది వాళ్లిళ్లల్లో తాతో, మామ్మో చచ్చిపోయిందని సెలవులు పెడతారు. నాకు ఎప్పుడూ ఆ ఛాన్స్ రాలేదు. అందుకే నేను ఎంతో ఆత్రుతతో చూస్తున్నాను. చనిపోవడం అంటే ఏమిటో పూర్తిగా తెలియని వయసది. అప్పటికి ఎప్పుడూ శవాన్నే చూడలేదు. అంతేకాక నిజంగా కోయవాడి మందు పని చేస్తుందా లేదా అనే డౌటు.

మధ్యాహ్నం ఇంటికి వచ్చేటప్పటికి నాన్నమ్మ బాగానే వుంది. మాతో కలసి అన్నం తింది. మళ్లీ మేము స్కూలుకి వెళ్లిపోయాము. సాయంత్రం వెళ్లేసరికి చచ్చిపోతుందేమో. సాయంత్రం స్కూలు విడిచిపెట్టగానే ఆడుకోకుండా వెంటనే ఇంటికి వచ్చేసాము. మరుసటి రోజు ఆదివారం. తెల్లవారే లేచింది. నేను వాకిలి తుడిస్తే తాను పేడ తెచ్చి కళ్లాపి చల్లింది.

వేడినీళ్లతో స్నానం చేసింది ఇస్త్రీ చీర కట్టుకుని అరుగుమీద ఎండలో కూర్చుంది. ఆవాలు నూనె తెచ్చుకుని వంటికి రాసుకుంది. నాన్నమ్మకి శరీరాన్ని ఎలా చూసుకోవాలో బాగా తెలుసు. ఆమె దగ్గర ఆవాలు నూనె, వేప నూనె, చేపలనూనె రకరకాలు నూనెలున్నాయి. చుట్టుపక్కల ఏ ముసలమ్మ దగ్గర అవి ఉండవు. పొడవైన జుట్టువిప్పి దువ్వుకుని సిగ వేసుకుంది.

అమ్మ వేడన్నం పెడితే తినేసింది.

"సుశీలా ఏమి వండుతావు" అమ్మని అడిగింది.

"గుడ్లు తెప్పిస్తాను అత్తయ్యా" అమ్మ అంది.

"వద్దు. నేను బజారుకెళ్లి పిత్తబరిగెలు తెస్తాను. పులుసు చేయి".

అమ్మ డబ్బివ్వబోయింది.

"వద్దులే. నేను తెస్తాను" అని నావైపు తిరిగి "శామా సంచి పట్టుకుని రా" అంది. పెట్టెలో డబ్బులుతీసి చేతిలో పట్టుకుంది.

'అంటే నాన్నమ్మ పిత్తబరిగెల పులుసు తిని తృప్తిగా చచ్చిపోతాదన్న మాట. అంటే ఈరోజు చచ్చిపోవడం ఖాయం' మనసులో అనుకున్నాను. వెంటనే సంచి పట్టుకుని నాన్నమ్మ వెంటే బజారుకు వెళ్లాను. నాన్నమ్మతో ప్రతిసారి బజారుకి వెళ్లేది నేనే. డబ్బులు పిడికిట గట్టిగా పట్టుకుంది.

బజారులోకి వెళ్లి పిత్తబరిగెలు గీసి గీసి బేరమాడి తీసుకుంది. తీసుకున్న తరువాత కొసరు వెయ్యమని దబాయింపు. ఆ చేపలోడుకి చిరాకేసింది. చేపలు సంచిలో వేసి పట్టుకుంది. బజారులో ఇంకో మూల పొగాకు ఆకులు తీసుకుంది. నాన్నమ్మ ఇంట్లో తనకు కావాల్సిన చుట్టలు తానే తయారు చేసుకునేది. ఏదో సిన్మాలో రాజనాల ఇంత పొడవాటి చుట్ట కాలుస్తుంటాడు. అంత పొడుగు చుట్టలు చుట్టుకుంటుంది. ఇవేవీ నాన్నకు తెలీదు. దొంగచాటుగా చుట్టుకుని దాచుకునేది.

'ఇవెందుకు ఇప్పుడు తీసుకుంటుంది. ఓహో... ఇంట్లో చుట్టలు అయిపోయి ఉంటాయి. మధ్యాహ్నం అన్నం తిన్నాక దర్జాగా చుట్ట కాల్చి అప్పుడు చచ్చిపోతాదేమో' అని అనుకున్నాను.

ఎప్పుడూ లేనిది ఆ రోజు బజారులో మాకోసమని చెప్పి అరటిపళ్లు కూడా కొంది. ఇంటికివచ్చి అమ్మ చేతికి చేపల సంచి అందిస్తూ "బాగా వండు" అంది. తరువాత చుట్టలు చుట్టుకోవడం ప్రారంభించింది. దగ్గర కూర్చుని పన్నెండు చుట్టలు చుట్టింది.

'ఈరోజుకి ఒకటి చుడితే సరిపోయేదిగా. మిగిలిన పదకొండు వేస్ట్ అయిపోతాయి' అనుకున్నాను.

తరువాత "శామా! మంచం బయటకు తోడుపట్టు" అని తన నులక మంచం బయటకు తెచ్చి వదులైందని దాన్ని టైట్ చేసుకుంది. తరువాత పక్కింటివాళ్ల గుమ్మంలో కూర్చుని అందరితో బాతాఖాని కొట్టుకుని కూర్చుంది. 'ఆఖరుసారికదా అందుకే అందరితో చక్కగా మాట్లాడుతోంది' మనసులో అనుకున్నాను. మధ్యాహ్నం అమ్మ భోజనానికి పిలిచింది. నాన్నమ్మ సాధారణంగా నవ్వదు. ముఖం ముడుచుకుని ఉంటుంది. అలాంటిది ఆ రోజు నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ, పులుసు బాగా వండావని అమ్మని పొగుడుతూ అన్నం తిన్నది. భోజనం చేసి కొత్త చుట్ట కాల్చి రెండుగంటలు పడుకుంది. సాయంత్రం టీ తాగి బయటవున్న గోరింటాకు చెట్టు ఆకంతా కోసి కొంగులో వేసుకుంది. కొంత ఇంట్లోకి తీసి మిగతాది చుట్టుపక్కల ఓ పది పదిహేను ఇళ్లల్లో తలా గుప్పెడేసి పంచింది.

"ఇంకొంచెం ఇయ్యే అచ్చుమ్మ..." అంటే వాళ్లమీద గయ్యిమంది. "అందరికీ సర్దాలికదే" అంది.

నాన్నమ్మ వెనకాల వాళ్లు మూతి తిప్పేవాళ్లు "ఎందుకిదీ నూరితే చేతులకి తక్కువ, పాదాలకి ఎక్కువ అయిపోతాది" అనేవాళ్లు. కానీ వాళ్లు గోరింటాకు విడిచి పెట్టేవారుకాదు. ఎందుకంటే ఆ చుట్టుపక్కల ఎవరికీ గోరింటాకు చెట్టులేదు. అందులో మా గోరింటాకు బాగా ఎర్రగా పండుతుంది.

శ్రావణమాసం, ఆషాడ మాసంలో నాన్నమ్మ గోరింటాకు అందరికీ పంచేది. 'గోరింటాకు పంచితే పుణ్యం వస్తుంది' అనేది. 'అందుకే పుణ్యం కోసం ఆఖరిసారి పంచుతుంది' ఆ సాయంత్రం నేను డిసైడ్ అయిపోయాను. ఈ రోజు ఖచ్చితంగా చచ్చిపోతుంది' అని.

నా ఫ్రెండ్స్ వచ్చారు. ఆడుకుందాం రమ్మన్నారు. కానీ నేను రానన్నాను. ఏం రావని ఆరా తీస్తే అసలే నాకు కడుపు పొంగు ఎక్కువ. నోట్లో ఒక్కటీ నిలువదు. ఎవరికీ చెప్పవద్దని అందరిచేత ఒట్లు వేయించుకుని మరీ చెప్పాను.


"నా నాన్నమ్మ చచ్చిపోతుంది. రేపు స్కూల్‌కి కూడా రాను" అంది.

నాన్నమ్మ గోరింటాకు సన్నిరాయిమీద నూరింది. గిన్నెడు అయింది. చెల్లి చేతికి, నా చేతికి పెట్టింది. పాపం, ఆఖరిసారి కదా అని నాన్నమ్మ చేత పెట్టించుకున్నాను.



## స్లిమ్‌గా నమిత

తెలుగు చిత్రం ద్వారా హీరోయిన్ అయిన నమిత తమిళ రంగానికెళ్లి టాప్ హీరోయిన్ స్థాయికి ఎదిగింది. 'మరీ బొద్దు'గా వుండడం వల్ల కూడా టాలీవుడ్ చాన్సులు ఆమెకి కరువయ్యాయి. కానీ ఇటీవలే 'కొంచెం' స్లిమ్ అయినట్టుగా వుండడం వల్లనో ఏమో ఒకటి రెండూ తెలుగు సినిమాలు ఆమె ఇంటి తలుపు తట్టాయి. తాజాగా ఆమెకి బాలకృష్ణతో నటించే చాన్స్ వచ్చింది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నిర్మాణం కానున్న సినిమాలో నమిత ఓ నాయికగా నటిస్తోంది.



"సుశీలా! గిన్నెలో గోరింటాకు ఉంది. రాత్రికి పెట్టుకుని పడుకో" అంది.

రాత్రి భోజనాలయ్యాక అమ్మ గిన్నెలు తీసుకెళ్ళి బయట తోమితే నాన్నమ్మ వంటిల్లు, ఇల్లంతా అలికింది. పిడికిలిలో సుద్ద ఉంచి టకటకామని అరుగుకి, పొయ్యి చుట్టూ పెడుతుంటే తమాషాగా చూసేవాళ్లం మేము.

"నాన్నమ్మ ఎంత మంచిది. చచ్చిపోయేముందు మంచి పన్లు చేసింది. ఎవరితో తగవు పెట్టుకోలేదు. ఖచ్చితంగా స్వర్గానికే వెళ్తుంది"

ఆ రాత్రి నిద్దర్లో అవే కలలు. దేవతలు వచ్చారు. వాళ్లతో కలసి పుష్పక విమానం మీద వెళ్లిపోతుంది. అందరికీ చేయి వూపుతుంది.

తెల్లవారి లేచి చూస్తే మంచంమీద కూర్చుని టీ తాగుతూ కనిపించింది. కోపం వచ్చేసింది నాకు. భరిణలో చూసాను. వేరుముక్క అలాగే ఉంది.

'ఈరోజు స్కూల్‌కి రానని ఫ్రెండ్స్‌తో చెప్పేసాను. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని స్కూల్‌కి వెళతాను' నాకు చాలా ఇన్‌సల్ట్‌గా ఉంది. అయినా తప్ప లేదు. స్కూల్‌కి వెళ్లాను. ఫ్రెండ్స్ అందరూ "ఏం మీ నాన్నమ్మ చచ్చిపో లేదా" అన్నారు ఆత్రంగా. "లేదు" అని జవాబిచ్చాను నీరసంగా.

మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేస్తుంటే "శామా! సినిమాకి ఎల దామా! లవకుశ అంట. ఆ బాబుగారి (ఎన్.టి.రామారావు) సినిమా" అంది.

అమ్మ గబుక్కున "మీరు రాముడమ్మతో కలసి వెళ్లండత్తయ్యా. దానికి స్కూల్ ఉంది కదా" అంది.

'ఓహో తనకిష్టమైన హీరో రామారావు సినిమా చూసి హాయిగా చచ్చి పోతాది గావాల' అనుకుని "అమ్మా! నేను నాన్నమ్మతో కలసి సిన్మాకి వెళ తాను. ఈ రోజు తెలుగమ్మగారు రారు. ఇంగ్లీషు మాస్టారు ఊరెళ్లారు. స్కూల్‌కి వెళ్లినా వేస్టే. ఖాళీగా ఉండాలి. నాన్నమ్మతో సిన్మాకే వెళతాను" గడగడా పాఠం అప్పజెప్పినట్లు చెప్పేసాను.

అమ్మ నావైపు కోపంగా చూసింది. కానీ నాన్నమ్మ సంతోషించింది.

సిన్మాకి వెళ్లాము. బెంచీకి టిక్కెట్టు తీసుకుంది. రాముడు కనిపించినప్పు డల్లా దండాలు పెట్టింది.'అమ్మయ్య... ఈ రోజు ఖచ్చితంగా చచ్చిపో తుంది' అనుకున్నాను. కానీ తెల్లవారి చూస్తే... షరా మామూలే! చిర్రెత్తుకొ చ్చింది నాకు. ఇంకో రెండురోజులు చూసాను. భరిణలోని వేరుముక్క అలాగే ఉంది. మూడోరోజు కోపంగా అడిగేసాను "నాన్నమ్మా! ఈ వేరు ముక్క తినవా" అని. ఒక్కసారి కస్సున లేచింది.

"ఏమే నాను ఎప్పుడు సచ్చిపోతానా అని మీ అమ్మ, మీరు సూత్తు న్నారు. నాను బతికుంటే మీకంత కట్టంగా ఉందే" అని అరిచింది.

"మరి... ఇది ఎందుకు కొన్నావు" అడిగాను మొండిగా.

"నా ఇట్టమే. నువ్వెవరే అడగడానికి. సివరికి ఈ పిల్లలకి సులకనైపో నాను. నాను సచ్చిపోతే మీకంత ఇట్టమే. నా పీడ ఎప్పుడు విరగడైపోతాదా అని సూస్తున్నారు" అని తిడుతూనే వుంది.

ఆ రోజు సాయంత్రం స్కూల్ నుండి వచ్చిన వెంటనే భరిణలో చూస్తే వేరుముక్కలేదు. 'అమ్మయ్య... ఇప్పటికైనా తిన్నదన్నమాట' ఒకవైపు సంతోషం, మరోవైపు ఆందోళన. నాన్నమ్మ ఏదని అమ్మను అడిగాను.

"ఏమో మధ్యాహ్నం అన్నం తినేసి బయటకు వెళ్లింది" అంది.

ఎక్కడ పడిపోయిందో ఏమో అని నేను వెతకడానికి బయలుదేరాను.

సందులోనే ఎదురొచ్చింది. మామూలుగానే వుంది. టీ తాగడానికి ఇంటికి వస్తుంది. కోయవాడి మందు పని చేయలేదన్నమాట. వాడు మోసం చేసాడు. మనసులో వాణ్ని తిట్టుకున్నాను.

నెమ్మదిగా "నాన్నమ్మా... వేరుముక్క ఏది?" అడిగాను.

"ఏమో నాకు తెలీదు" అంది కోపంగా.

వేరుముక్క ఏమైందని చెల్లిని అడిగాను. విషయం తెలిసిన అమ్మ దాన్ని పారేసిందని చెప్పింది. అది విని బోల్డు నిరాశపడ్డాను.

అమ్మని బెదిరించడానికేగానీ నాన్నమ్మకసలు చనిపోయే ఉద్దేశ్యమే లేదని అప్పట్లో నాకు తెలియక ఎంత అవస్థ పడ్డానో గుర్తుకొచ్చి నవ్వుకు న్నాను.అంతలో నా ఎదురుగా కొరకొరా చూస్తూ ముఖం మాడ్చుకుని ఉంది నా జూనియర్ నాన్నమ్మ ఉరఫ్ మా అమ్మాయి. జీన్స్ లక్షణాలంటే ఇదే కాబోలు. పోలికలే కాదు, అచ్చుగుద్దినట్లు అలవాట్లుకూడా మా నాన్న మ్మవే. "ఏమైంది?" అన్నాను నవ్వాపుకుంటూ.


"నాకిష్టంలేని కూర చేసావు. తమ్ముడికి ఇష్టమైనది వండావు."

నాన్నమ్మ చనిపోయినా నా కూతురి రూపంలో రోజూ దర్శనమిస్తూనే ఉంది.

"రాత్రికి నీకిష్టమైనవి వండుతాను. సరేనా. ముఖం అలా పెట్టకు. ఏదీ ఒక్కసారి నవ్వు తల్లీ" అన్నాను బుజ్జగింపుగా.

నవ్వింది అచ్చం నాన్నమ్మ నవ్వినట్లు.

★



## వజ్రాల గడియారాలు

మనకి నగలు చేయించుకోవడానికే వజ్రాలు దొరకడం కష్టమవుతుంటే స్విట్జర్లాండ్‌లో ఏకంగా గడియారాల్లో వజ్రాల్ని పొదుగుతున్నారుట. సంవత్సరానికి బిలియన్ డాలర్ల విలువైన రిస్టువాచీలు ఆ దేశంలో అమ్ముడవుతున్నాయిట. ఈ మధ్య ముంచుకొచ్చిన ఆర్థిక మాంద్య ప్రభావంవల్ల తమ అసలు వాచీల అమ్మకాలు పడిపోయి జనాలు నకిలీల వెంట పడుతున్నారని వాళ్లు వాపోతున్నారు.

-తటవర్తి

